క్లుప్తంగా

వెండి కవచం సమర్పణ



కోడూరు: మండలంలోని లింగారెడ్డిపాలెం గ్రామంలో వేశ్లమ్మ అమ్మవారికి దాతలు వెండి కవచాన్ని సమర్పించారు. గ్రామానికి చెందిన చిట్టిప్రోలు హరిబాబు జ్ఞాపకార్థం భార్య విజయనిర్మల అమ్మవారికి రూ.54 వేలు విలువ గల వెండి కవచాన్ని అందించారు. దాత విజయనిర్మలను ఆలయ కమిటీ సభ్యులు దుశ్శాలువాలతో సత్కరించారు. గ్రామంలో నూతనంగా నిర్మించిన అమ్మవారి ఆలయానికి ఈ వెండి కవచం అందించడం సంతోషంగా ఉందని విజయనిర్మల తెలిపారు. పీఏసీఎస్ చైర్‌పర్సన్ చిట్టిప్రోలు బ్రహ్మారావు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

మైనార్టీ గురుకులంలో ప్రవేశానికి అవకాశం

చిలకలపూడి(మచిలీపట్నం): మచిలీపట్నం నగరంలో నిర్వహిస్తున్న ఆంధ్రప్రదేశ్ మైనార్టీ బాలుర గురుకుల పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ పీవీఎస్ రాజేంద్రప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాలలో 5, 6, 7, 8 తరగతుల్లో ప్రవేశ పరీక్షతో సంబంధం లేకుండా చేరవచ్చన్నారు. 5వ తరగతిలో 63, 6–53, 7–47, 8–49 సీట్లు ఉన్నాయన్నారు. ముస్లింలు, క్రిష్టియన్లు ఇతర మైనార్టీలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. భోజన సదుపాయంతో పాటు వసతి సౌకర్యం కలిస్తామన్నారు. ఇంగ్లిషు మీడియంలో బోధనతో పాటు ఉర్దూ మొదటి లాంగ్వేజ్‌గా ఉంటుందన్నారు. వివరాలకు 87126 25035 నంబరులో సంప్రదించాలని కోరారు.

పేపర్‌తో పుష్పగుచ్ఛాల తయారీ



గూడూరు: కృష్ణాజిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంపు వల్ల విద్యార్థులకు ఎంతో ప్రయోజనం ఉందని సంస్థ కార్యదర్శి ఎం.వి.డి.టి.నగేష్ అన్నారు. గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో గూడూరు శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంపును సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పేపర్ క్రాఫ్ట్ ద్వారా విద్యార్థులు పుష్పాకృతులు రూపొందించగా వారిని అభినందించారు. సమ్మర్ క్యాంపును ప్రతి ఒక్కరూ సద్వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో గ్రంథాయల అధికారి వై.శ్రీనివాసరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నాగాయలంక: మండలంలోని గణపేశ్వరం సబ్‌స్టేషన్ పరిధిలో గణపేశ్వరం, పర్రచివర, టి.కొత్తపాలెం, పెదపాలెం, దిండి, పెదగొడపాలెం, సొర్లగొంది, బర్రంకుల తదితర గ్రామాల్లో మంగళవారం కరెంటు ఉండదని మండల విద్యుత్ శాఖ ఏఈ జి.ఏడుకొండలు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 33/11కేవీ లైన్ల మరమ్మతు పనులు చేపడుతున్న కారణంగా ఉదయం గం.10.00 నుంచి సాయంత్రం గం.5వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తామని తెలిపారు. వినియోగదారులు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

తెగిపడిన విద్యుత్ తీగలు



మచిలీపట్నంటౌన్: నగరంలోని రేవతి సెంటర్‌లో పెట్రోల్ బంకు పక్కనే ఉన్న విద్యుత్ స్తంభం నుంచి సోమవారం విద్యుత్ ప్రవహిస్తున్న తీగ తెగిపడింది. దీంతో అటుగా వెళ్లే స్థానికులు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. ఉదయాన్నే ఎంతో రద్దీగా ఉండే ఈ ప్రాంతంలో ఈ సంఘటన చోటు చేసుకుంది. అప్రమత్తమైన పెట్రోల్ బంక్ సిబ్బంది, స్థానిక పోలీసులు, విద్యుత్ ప్రవహిస్తున్న తీగకు అడ్డంగా భారీకేడ్లు పెట్టి విద్యుత్ అధికారులకు సమాచారం ఇచ్చారు. విద్యుత్ సరఫరా అవుతున్న తీగ తెగిపడిన సమయంలో ఆ ప్రాంతంలో ఎవరు లేకపోవడంతో పెద్ద ప్రమాదమే తప్పిందని స్థానికులు చెప్పారు.

వైభవంగా ధ్వజారోహణ

భావదేవరపల్లి(నాగాయలంక): గ్రామంలోని శ్రీదేవి భూదేవి శ్రీరాజ్యలక్ష్మి సమేత శ్రీభావన్నారాయణ స్వామి కల్యాణ మహోత్సవాల్లో భాగంగా సోమవారం ఉదయం శాస్త్రోక్తంగా ధ్వజారోహణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకుడు పంచాంగం రమణాచార్యులు, కందూరి శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో వంశపారంపర్య ధర్మకర్త భోగాది విశ్వేశ్వరరావు, భోగాది వెంకట శేషగిరిరావు, అప్పారాయుడు, లోకేశ్వరరావు జంటలు పీటలపై కూర్చుని ధ్వజారోహణ పూజాధికములు జరిపారు. అనంతరం ప్రాంగణంలోని యాగశాలలో హోమాలు, అగ్నిప్రతిష్ఠ నిర్వహించారు. బుధవారం రాత్రి ఉత్సవాల్లో కీలకమైన ఎదుర్కోలు వేడుక, కల్యాణ మహోత్సవం నిర్వహిస్తామని వివరించారు. ధర్మకర్తల కుటుంబ సభ్యులు, గ్రామ ప్రముఖులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

పెరిగిన వేతనం.. ఉపాధికి ఊతం

- రోజువారీ ఉపాధి కూలి రూ.300
- గ్రామాల్లో ముమ్మరంగా ఉపాధి హామీ పనులు
- పెరుగుతున్న మౌలిక వసతులు



ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలు

కృత్తివెన్ను: వలసల నివారణతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో పేదప్రజల ఆర్థిక పరిస్థితిని మెరుగుపరిచేందుకు ఏర్పాటు చేసిన ఉపాధిహామీ పథకం తోడ్పడుతోంది. ఈ పథకం కింద చెల్లించే వేతనం రూ.300 పెంపుతో కూలీలకు మరింత మేలు చేకూరుతోంది. గ్రామాల్లో గతంలో కంటే మిన్నగా ప్రజలు ఈ పథకంలో పనులకు వెళుతున్నారు. పెడన నియోజకవర్గంలో షుమారు 50 వేల మందికి పైగా ఈ పనుల్లో పాల్గొంటున్నట్లు అధికారుల గణాంకాలు వెల్లడిస్తున్నాయి.

రోజువారీ వేతనం రూ.300..

ఉపాధి పథకంలో రోజువారీ వేతనం రూ.250 ఉండేది. ఈ మొత్తాన్ని రూ.300 వరకు పెంచారు. దీంతో చేసిన పనిని బట్టి వేతనం చెల్లింపులు జరుగుతాయి. పెరిగిన వేతనంతో ఉపాధి కూలీల్లో సంతోషం కనిపిస్తోంది. గతంలో కంటే ఇప్పుడు పనులకు వచ్చే వారి సంఖ్య కూడా పెరిగింది.

గ్రామాల్లో అభివృద్ధి..

ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు తమ గ్రామంలోనే పని దొరకడంతో పాటు ఆయా గ్రామాల్లో అభివృద్ధి సైతం మెరుగుపడుతోంది. తాగునీటి చెరువుల్లో పూడిక తీత, పంటకాలువల్లో పూడిక, శ్మశానాలు, ప్రభుత్వ కార్యాలయ ప్రాంగణాల్లో పల్లపు ప్రాంతాలను మెరక చేయటం, మొదలైన పనులతో అభివృద్ధి కనిపిస్తోంది. రైతుల పంటపొలాలకు నీటి ఎద్దటి సమయంలో ఆదుకునేలా పంటసంజీవని పేరుతో కుంటలు తవ్వకం ఎంతో మేలు కలిగిస్తోంది.

పెడన నియోజకవర్గంలో ఉపాధి కూలీల వివరాలు..

మండలం	జాబ్‌కార్డులు	వేతనదారులు
కృత్తివెన్ను	6606	11,850
బంటుమిల్లి	6933	12,447
గూడూరు	7792	13,807
పెడన	6708	11,838

అభివృద్ధే లక్ష్యంగా పనులు..



ఉపాధికూలీలకు ఆయా గ్రామాలలో పనులు కల్పించడంతో పాటు చేసే పనులు గ్రామానికి, ప్రజలకు ఉపయోగపడేలా జాగ్రత్తలు తీసుకుంటున్నాం. అమృత్‌సరోవర్ పేరుతో చెరువుల అభివృద్ధి చేస్తున్నాం. ఆర్‌సీపీతో పంటపొలాలకు వెళ్లే డొంకరోడ్లను సైతం అభివృద్ధి చేస్తున్నాం.

–కొట్టే హర్షవర్ధన్, ఈసీ, ఇన్‌చార్జ్ ఏపీవో, కృత్తివెన్ను

చాలా ఉపయోగంగా ఉంది



ఉపాధి పథకం మాలాంటి పేదలకు ఎంతో ఉపయోగపడుతోంది. గతం కంటే ఇప్పుడు వేతనం సైతం పెరగడం ఎంతో సంతోషంగా ఉంది. మా గ్రామంలో చెరువులు తవ్వడం వల్ల వేసవిలో నీటి సమస్య లేకుండా పోయింది.

–ఆర్.నాగేశ్వరరావు, సీతనపల్లి

కనులపండువగా వాసవీ అమ్మవారి ఊరేగింపు



అమ్మవారి ఊరేగింపులో వేషధారణలతో కళాకారుల ప్రదర్శన

కోడూరు: వాసవీ కన్యకా పరమేశ్వరీ అమ్మవారి జయంతోత్సవాల్లో భాగంగా సోమవారం అమ్మవారి ఊరేగింపును కనులపండువగా నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై అమ్మవారి ఉత్సవమూర్తిని కోడూరు పురవీధుల వెంట ఊరేగించారు. ఆర్యవైశ్య ప్రముఖులు, మహిళలు వాహనం ముందు అమ్మవారికి హారతులు పట్టి స్వాగతం పలికారు. కళాకారులచే నిర్వహించిన వివిధ రకాల ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి. కాళీ అమ్మవారు, వాసవీ అమ్మవారు, లక్ష్మీ నరసింహస్వామి, శక్తి వేషాల్లో కళాకారులు రహదారి పొడవునా ప్రదర్శిస్తూ ఊరేగింపును ముందుకు కొనసాగించారు. దానాశక్తి ఆర్యవైశ్య ప్రార్థనా మందిరంలోని వాసవీ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి, లలితా, విష్ణు సహస్రపారాయణాలను భక్తిప్రపత్తులతో నిర్వహించారు. ఆర్యవైశ్య ప్రముఖులు బూరగడ్డ హరినాథ్‌బాబు, మద్దాళి ప్రసాద్, అన్నం శ్రీనివాస్, కోడూరు సత్యనారాయణ, దేసు మల్లిఖార్జునరావు, అన్నం శివరామకృష్ణ పర్యవేక్షించారు.

ముగిసిన వాసవీ జయంతి ఉత్సవాలు

పెడన: స్థానిక కన్యకా పరమేశ్వరి ఆలయంలో నిర్వహిస్తున్న శ్రీ వాసవీమాత జయంతి మహోత్సవాలు సోమవారం ఘనంగా ముగిశాయి. ఆర్యవైశ్యుల ఆరాధ్యదైవమైన వాసవీ జయంతిని మూడు రోజులుగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. చివరి రోజైన సోమవారం అమ్మ వారికి లక్ష మల్లెల పుష్పార్చన చేశారు. పట్టణానికి చెందిన 80 మంది మహిళలతో వాసవీ క్షేత్రం ప్రధాన అర్చకులు స్వర్ణ సాయిబాబు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. పట్టణ వాసవీ మహిళా మండలి ఆధ్వర్యంలో శ్రీలలితా పారాయణ పఠనం జరిగింది. అమ్మ వారి ఉత్సవ విగ్రహాన్ని మేళతాళాలతో పురవీధుల్లో ఊరేగించారు. ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కొల్లూరి చిన్నా మాట్లాడుతూ మంగళవారం ఆర్యవైశ్య అన్నసమారాధన నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కొల్లూరి రాజా, ఉత్సవ కమిటీ కన్వీనర్ కొల్లూరి రాధాకృష్ణ గుప్తా, కొమ్మూరి శారద, మామిడి సావిత్రి, కొల్లూరి మంజులత, తమ్మన లక్ష్మీతయారు, కొమ్మూరి విజయ దుర్గ, పొన్నూరు అపర్ణ, కొల్లూరి పద్మ, మామిడి రేణుక తదితరులు పాల్గొన్నారు.



అమ్మవారికి మల్లెలతో పూజ నిర్వహిస్తున్న మహిళలు

శాంతిభద్రతలకు విఘాతం కలిగించొద్దు

–144 సెక్షన్ అమలులో ఉంది

నాగాయలంక: ఎలక్షన్ కోడ్ ఇంకా అమలులో ఉన్నందున శాంతి భద్రతలకు ఎటువంటి విఘాతం కలిగించి భవిష్యత్‌ను పాడుచేసుకోవద్దని నాగాయలంక ఎస్.ఐ ఎం.సుబ్రహ్మణ్యం హెచ్చరించారు. సోమవారం ఆయన ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. నాగాయలంక మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో 144 సెక్షన్ అమలులో ఉందని తెలిపారు. 30 పోలీస్ యాక్ట్ ప్రకారం ప్రజలు, రాజకీయ పార్టీలు లేదా ప్రజా సంఘాలు ఎలాంటి ముందస్తు అనుమతులు లేకుండా సభలు, సమావేశాలు, ర్యాలీలు, ధర్నాలు నిర్వహించరాదని, ఎన్నికల తరుణంలో ఘర్షణలకు పాల్పడితే భవిష్యత్‌లో నేరస్తులుగా మిగిలి పోతారని ఎస్‌ఐ పేర్కొన్నారు. సాధారణ ఎన్నికల కౌంటింగ్ ముగిసి ఎన్నికల కోడ్ తొలగిపోయే వరకు పార్టీల కార్యకర్తలు, ప్రజలు సమన్వయం పాటించి ఎలాంటి ఘర్షణలకు పాల్పడకుండా సహకరించాలని కోరారు. నిబంధనలకు విరుద్ధంగా ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా కఠినచర్యలు తీసుకుంటామన్నారు. డయల్ 100 నంబరుకు సమాచారం ఇవ్వాలని కోరారు.

నిబంధనలు పాటించకపోతే చర్యలు

చల్లపల్లి: ఎన్నికల కమిషన్ ఆదేశాలు పాటించకపోతే చట్టరీత్యా చర్యలు తప్పవని తహసీల్దార్ బి.సుమతి స్పష్టం చేశారు. సోమవారం సాయంత్రం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో పెట్రోల్ బంక్ నిర్వాహకులు, బాణ సంచా హోల్‌సేల్ దుకాణదారులతో అవగాహన సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ అల్లర్లకు ఊతమిచ్చేలా ఎవరు ప్రవర్తించినా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. పెట్రోల్, డీజిల్ విడిగా బాటిళ్లు, టిన్నుల్లో విక్రయించవద్దని సూచించారు. టపాసుల విక్రయాలపై ఎన్నికల కమిషన్ నిబంధనలు పాటించాలని సూచించారు. గ్రామాల్లో అనుమానాస్పద, కొత్త వ్యక్తులు సంచరిస్తూ ఉంటే చర్యలు చేపట్టాలని కోరారు. సమావేశంలో సీఐ సీహెచ్.నాగప్రసాద్, ఆర్ఐ ఘంటసాల కృష్ణ మోహన్, వీఆర్వోలు పాల్గొన్నారు.

ఐదో రోజూ ప్రశాంతంగా ఈఏపీసెట్

పెడన: మండలంలోని నందమూరు శ్రీ వాసవీ ఇంజినీరింగ్ కళాశాలలో సోమవారం ఈఏపీ సెట్ ఇంజినీరింగ్ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. ఐదోరోజు ఇంజినీరింగ్‌కు సంబంధించి ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు జరిగిన పరీక్షకు 192 మందికి గాను 187 మంది హాజరయ్యారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరిగిన పరీక్షకు 192 మందికి గాను 191 మంది హాజరైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ బీఎస్ఎన్ రెడ్డి తెలిపారు.

దివిసీమలో బెట్టింగుల జోరు

అవనిగడ్డ: ఎన్నికల ఫలితాలపై దివిసీమలో జోరుగా బెట్టింగులు సాగుతున్నాయి. అవనిగడ్డలో ఎవరు గెలుస్తారు, ఎంపీగా ఎవరు విజయం సాధిస్తారు, రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ అధికారంలోకి వస్తుందా, కూటమి గెలుస్తుందా వంటి అంశాలపై జోరుగా బెట్టింగులు జరుగుతున్నాయి. గ్రామాలు, మండలాల వారీగా ఓటింగ్ సరళిని బేరీజు వేసుకుని బెట్టింగులు కాస్తున్నారు. గెలుపు ఓటములు, మెజారిటీపై బెట్టింగ్‌లు సాగుతున్నాయి.

ఏ నలుగురు కలిసినా..

ఎక్కడ ఏ నలుగురు కలిసినా ఎన్నికల గురించే చర్చించుకుంటున్నారు. ఈ సారి ఓటింగ్ జరిగిన తీరు, కూటమి కలయిక నేపథ్యంలో మైనస్‌లు, ప్లస్‌లు మహిళల ఓటింగు, యువత ఎటువైపు, కులాల వారీగా సమీక్షలు ఇలా అన్ని విషయాలను తీవ్రంగా చర్చించుకుంటున్నారు.

ఆకట్టుకున్న సత్యహరిశ్చంద్ర నాటకం



నాటక ప్రదర్శనలో సన్నివేశం

కోడూరు: మండలంలోని లింగారెడ్డిపాలెం గ్రామంలోని గోకర్ణేశ్వరుడి కల్యాణోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహించిన సత్యహరిశ్చంద్ర పౌరాణిక నాటకం ఆకట్టుకుంది. అవనిగడ్డకు చెందిన శ్రీ విజయ నాట్యమండలి కళాకారులు ఆలయ ప్రాంగణంలో ఈ నాటక ప్రదర్శన నిర్వహించారు. ప్రముఖ కళాకారుడు పుప్పాల వీరాంజనేయులు నాయుడు హరిశ్చంద్రుడి పాత్రలో నటించి సభికుల మన్ననలు పొందాడు. చంద్రమతి, విశ్వామిత్రుడు, నక్షత్రకుడు పాత్రలు విశేషంగా ఆకట్టుకున్నాయి. నాటకంలోని వారణాసి, వేట, కాటి సీన్లు విశేషంగా అలరించాయి. ఆలయ ఈఓ సీహెచ్.సుధాకర్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

క్షణికావేశంలో జీవితాలను నాశనం చేసుకోవద్దు



మాట్లాడుతున్న డీఎస్పీ మురళీధర్, సీఐ నాగప్రసాద్, ఎస్ఐ ప్రతాప్ రెడ్డి

డీఎస్పీ మురళీధర్

శ్రీకాకుళం(ఘంటసాల): ఎన్నికల ఫలితాలు వెలువడే వరకు క్షణికావేశంతో గొడవలు పడి జీవితాలను నాశనం చేసుకోవద్దని అవనిగడ్డ డీఎస్పీ పి.మురళీధర్ అన్నారు. ఎన్నికల ఫలితాలు వెలువడే వరకు గ్రామాల్లో ఎలాంటి అల్లర్లు లేకుండా జాగ్రత్తలు పాటించాలనే ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఘంటసాల మండలం శ్రీకాకుళం ప్రధాన సెంటర్లో ప్రజలకు సోమవారం సాయంత్రం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ పి.మురళీధర్ మాట్లాడుతూ పెట్రోల్ బంక్ యజమానులు, వ్యాపారులు ఎన్నికల ఫలితాలు విడుదలయ్యే వరకు బాటిళ్లలో పెట్రోలు అమ్మడానికి వీలు లేదన్నారు. ఎవరైనా అక్రమంగా అమ్మినట్లు తెలిస్తే వారిపై కేసులు నమోదు చేయడంతో పాటు పెట్రోల్ బంక్‌లను, అమ్మిన వ్యక్తుల షాపులను సీజ్ చేస్తామన్నారు. పెట్రోల్ బంకుల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. ప్రజలు కూడా ఎన్నికల ఫలితాలు వచ్చే వరకు ఎటువంటి అల్లర్లు, ఘర్షణలకు పాల్పడవద్దన్నారు. విద్యార్థులు, యువత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న సమయంలో సామాన్య ప్రజలతో పాటు విద్యార్థులపై కేసులు నమోదు అయితే వారి భవిష్యత్తు అంధకారం అవుతుందన్నారు. శాంతియుతంగా ఫలితాలు వచ్చే వరకు ప్రజలంతా సంయమనం పాటించాలని డీఎస్పీ మురళీధర్ తెలియజేశారు. ఈ సదస్సులో చల్లపల్లి సీఐ సీహెచ్.నాగ ప్రసాద్, ఎస్ఐ కె.ప్రతాప్‌రెడ్డి, స్థానికులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ



పెడన: పట్టణానికి చెందిన బండ్ల భాస్కరరావు పుణ్యతిథిని పురస్కరించుకుని పట్టణంలోని నిరుపేద చేనేత కార్మికులకు నిత్యావసర సరుకుల పంపిణీ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. భాస్కరరావు సతీమణి భారతీదేవి ఆధ్వర్యంలో పట్టణంలోని నిరుపేద వృద్ధ, అనారోగ్యంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఐదు చేనేత కుటుంబాలకు నెలరోజులకు సరిపడా రూ.10 వేల విలువైన నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు.

210 మందికి వైద్య పరీక్షలు

చల్లపల్లి: చంద్ర రాజేశ్వరరావు వికాస కేంద్రం ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం ఉచిత హోమియో వైద్య శిబిరం నిర్వహించారు. స్థానిక సీఆర్ వికాస కేంద్రంలోని హోమియో సెంటరులో హోమియో వైద్యులు 210 మందికి వైద్య పరీక్షలు చేశారు. ట్రస్ట్ ఆధ్వర్యంలో మందులు అందజేశారు.

కనులపండువగా గోకర్ణేశ్వరుడి రథోత్సవం



స్వామివారి రథాన్ని లాగుతున్న భక్తులు

కోడూరు: లింగారెడ్డిపాలెంలోని బాలా త్రిపుర సుందరీ సమేత గోకర్ణేశ్వరస్వామివారి కల్యాణోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి రథోత్సవాన్ని కనులపండువగా నిర్వహించారు. కల్యాణమూర్తులకు విశేష పూజలనంతరం ప్రత్యేకంగా అలంకరించిన రథంపై ఊరేగించారు. ఆలయం వద్ద నుంచి గ్రామంలోని ఊరచెరువు వరకు గ్రామస్తులు రథాన్ని లాగి భక్తిభావం చాటుకున్నారు. ప్రతి ఇంటి వద్ద రథోత్సవానికి స్వాగతం పలుకుతూ మహిళలు నీటిని వారబోసి, హారతులిచ్చారు. రథాన్ని విద్యుత్ దీపాలు, వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. సోమవారం ఉదయం గోకర్ణేశ్వరుడి మూలమూర్తికి పంచామృతాభిషేకాలను నిర్వహించారు. బిల్వార్చన, రుద్రాభిషేకాలను జరిపారు. ఉత్సవమూర్తులకు అవబృందోత్సవాన్ని భక్తిప్రపత్తులతో నిర్వహించారు. అనంతరం మహాపూర్ణాహుతిని జరపగా, భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. రాత్రికి స్వామివారికి, అమ్మవారికి పుష్పయాగాన్ని నిర్వహించారు. ఐదు రోజుల పాటు కల్యాణోత్సవాలను ఘనంగా నిర్వహించినట్లు ఆలయ ఈఓ సుధాకర్ తెలిపారు. జేఏ సీహెచ్ శివప్రసాద్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ప్రకాశం పంతులు సేవలు మరువలేనివి



ప్రకాశం పంతులు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నిర్వాహకులు

మచిలీపట్నంటౌన్: స్వాతంత్ర్య సమరయోధుడు, ఆంధ్ర రాష్ట్రం తొలి ముఖ్యమంత్రి, ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం పంతులు సేవలు మరువరానివని పలువురు వక్తలు పేర్కొన్నారు. ప్రకాశం పంతులు వర్ధంతిని సోమవారం నగరంలో నిర్వహించారు. ప్రకాశం పంతులు చిత్రపటానికి పలువురు ప్రముఖులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన రాష్ట్రానికి అందించిన సేవలను స్మరించుకుని కొద్దిసేపు ప్రకాశం పంతులు ఆత్మకు శాంతి చేకూరాలని మౌనం పాటించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ ప్రకాశం పంతులు జీవితాన్ని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. ప్రకాశం పంతులు రాజకీయ జీవితం రాజమండ్రి పురపాలక సంఘ అధ్యక్షుడిగా ప్రారంభమై, 1953లో ఆంధ్ర రాష్ట్రం ఏర్పడ్డ తర్వాత మనకి తొలి ముఖ్యమంత్రిగా పని చేశారని కొనియాడారు. నివాళులు అర్పించిన వారిలో మున్సిపల్ మాజీ చైర్మన్ మోటమర్రి బాబాప్రసాద్, పి.వి.ఫణి కుమార్, ధూళిపాళ్ల శ్రీరామచంద్రమూర్తి, సుంకర నరసింహారావు, బొడ్డు నాగరాజు, వెన్న ఫణి రాజ్, సూరిశెట్టి హరికృష్ణ, డి.సుబ్బారావు, జుజ్జూరి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పంట, మురుగు కాల్వలు బాగు చేయించండి

మండల పరిషత్ సమావేశంలో సర్పంచుల వినతి



సమావేశంలో ఎంపీపీ రాఘవరాణి, ఎంపీడీవోకు వినతి పత్రం ఇస్తున్న సర్పంచ్‌లు

నాగాయలంక: రుతుపవనాలు ఆశాజనకంగా వస్తున్న క్రమంలో రైతాంగానికి ఇబ్బందులు తలెత్తకుండా మండలంలోని పంటకాలువలు, మురుగు కాల్వలకు తక్షణమే మరమ్మతులు చేయించాలని పలువురు సర్పంచ్‌లు డిమాండ్ చేశారు. ఎంపీపీ రాఘవరాణి అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం సోమవారం జరిగింది. చాలామంది అధికారులు, సభ్యులు, సర్పంచులు సమావేశనికి హాజరు కాకపోవడంతో సమావేశం నామమాత్రంగా జరిగింది. అరగంట సమయంలోనే ముగిసింది. ఈ సందర్భంగా సర్పంచ్‌లు మండలి ఉదయభాస్కర్ (భావదేవరపల్లి), దున్న రాజేష్(పెదపాలెం) తదితరులు కాలువల బాగుచేతపై ఎంపీపీకి వినతి పత్రం అందజేశారు. సర్పంచ్‌ల సూచనలను పరిగణలోకి తీసుకుని అవసరమైన చర్యలకు జిల్లా ఉన్నతాధికారులు, ప్రభుత్వానికి నివేదిస్తామని ఎంపీడీఓ కె.రామ్‌కుమార్ చెప్పారు.

భక్తిశ్రద్ధలతో వార్షికోత్సవ పూజలు



ప్రత్యేక అలంకారంలో అభయాంజనేయుడు

కోడూరు: మండలంలోని నక్కవానిదారి గ్రామంలో అభయ ఆంజనేయస్వామివారి ద్వితీయ వార్షిక ప్రతిష్ఠా ఉత్సవాన్ని సోమవారం కనులపండువగా నిర్వహించారు. ఉదయం స్వామివారి మూలమూర్తికి ప్రత్యేక అభిషేకాలు చేశారు. అనంతరం తులసీదళాలు, వివిధ రకాల పుష్పాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామంలోని భక్తబృందాలచే 108 సార్లు హనుమాన్ చాలీసా పారాయణాన్ని భక్తిప్రపత్తులతో నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో రెండు వేల మందికి అన్నసమారాధన నిర్వహించారు. వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని ఆలయాన్ని శోభాయమానంగా తీర్చిదిద్దారు. కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ



రైతులకు పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ చేస్తున్న ఎంఏవో శివప్రసాద్

గూడూరు: వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో 50 శాతం సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలను సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గూడూరు మండల వ్యవసాయ శాఖ అధికారి జి.వి.శివప్రసాద్ మాట్లాడుతూ ఖరీఫ్‌కు ముందే వరి పండించే భూముల్లో పచ్చిరొట్ట విత్తనాలు సాగు చేసి, కలియ దున్నితే భూమిలో సేంద్రియ పదార్థాలు తయారై ఎరువుల వాడకం తగ్గుతుందన్నారు. మండలంలోని అన్ని రైతు భరోసా కేంద్రాల్లో పచ్చిరొట్ట విత్తనాలు రైతులకు అందుబాటులో ఉంచినట్లు ఆయన వెల్లడించారు. పిల్లిపెసర కేజీ రూ.67 చొప్పున ఎకరాకు 10 కిలోలు ఇస్తామన్నారు. జనుము, జీలుగ కిలో రూ.44 చొప్పున ఎకరాకు 10కిలోలు, గరిష్టంగా ఐదు ఎకరాలకు ఇస్తామని చెప్పారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగించుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో వీఏఏలు పూర్ణ ప్రభాకర్, కుమార్, రైతులు పోతన రాధాకృష్ణ, మాగంటి శ్రీనివాస్, పి.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగాలకు 84 మంది ఎంపిక



ఇంటర్వ్యూ నిర్వహిస్తున్న కంపెనీ ప్రతినిధి

మచిలీపట్నంటౌన్: నగరంలోని బైపాస్ రోడ్‌లో ఉన్న కృష్ణవేణి ఐటీఐ కళాశాల ఆడిటోరియంలో సోమవారం నిర్వహించిన జాబ్ మేళాలో 84 మంది అభ్యర్థులకు ఉద్యోగాలు లభించాయి. ఎల్ అండ్ టీ కంపెనీ ప్రతినిధులు నిర్వహించిన ఇంటర్వ్యూకు 150 మంది ఐటీఐ ఉత్తీర్ణులైన అభ్యర్థులు హాజరయ్యారు. వీరిలో 84 మంది వివిధ రకాల ఉద్యోగాలను పొందేందుకు ఎంపికయ్యారు. ఈ ఇంటర్వ్యూలలో ఎల్ అండ్ టీ సంస్థ ప్రతినిధులు, కృష్ణవేణి ఐటీఐ కళాశాల కరస్పాండెంట్ కొత్త గుండు రమేష్ పాల్గొని ఎంపిక ప్రక్రియ నిర్వహించారు.